# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 030
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
జనవరి 07, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## రూపు రేఖలు మారాలి

- ఇంచార్జి మంత్రి పొంగులేటి
- అధికారులతో కలిసి అభివృద్ధిపై సమీక్ష




8లో..



## భర్తపై కత్తితో దాడికి యత్నం

### వరంగల్ చౌరస్తాలో వివాహిత హల్‌చల్

వరంగల్ చౌరస్తాలో బుధవారం ఓ వివాహిత జ్యోత్స్న కత్తి పట్టుకుని హల్‌చల్ చేసింది. భర్త వివాహేతర సంబంధం పెట్టుకోవడంపై ఆగ్రహించిన యువతి కత్తితో దాడికి యత్నించింది. భార్య నుంచి తప్పించుకునేందుకు భర్త జ్యూవలరీ షాపులో దాక్కున్నాడు. వెంటనే డయల్ 100 కి ఫోన్ చేశాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి మహిళ చేతిలోని కత్తిని పోలీసులు లాక్కున్నారు. తనకు న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగింది. తన భర్త శ్రీకాంత్ వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని తనకు విడాకులు ఇస్తున్నాడని ఆరోపించింది. తనకు ఉండడానికి చోటు లేకుండా వేధింపులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఆస్తిని, పిల్లలను తనకు కాకుండా చేస్తున్నాడని మండిపడింది. కాగా విడాకుల కోసం భర్త శ్రీకాంత్ కోర్టు మెట్లు ఎక్కినట్లు తెలిపింది. పోలీసులు వివాహితకు నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. – వరంగల్ వాయిస్, క్రైం






# సర్పంచ్ కబ్జా

- కమలాపూర్‌లో విచిత్ర రాజకీయం
- గెలిచిన సర్పంచులపై పార్టీల కర్చీఫ్
- అన్నీ ఎమ్మెల్యే ఖాతాలోనే..
- బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులూ నా వాళ్లే అంటున్న కౌశిక్ రెడ్డి
- ఫోరం అధ్యక్ష పదవిపై ముదురుతున్న కుమ్ములాట

నిన్న, మొన్నటి వరకు భూముల కబ్జాలనే చూశాం.. కాని ఇప్పుడు సర్పంచులనే కబ్జా చేస్తున్నారు. రాజకీయ నాయకుల బరితెగింపు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో పంచాయతీ ఎన్నికల ఫలితాల కంటే, ఆ తర్వాత జరుగుతున్న 'రాజకీయ కబ్జా' పోరు ఇప్పుడు సంచలనంగా మారింది. ఎన్నికలకు ముందు తమ మద్దతుదారులను గెలిపించుకునేందుకు నానా హంగామా చేసిన ప్రధాన పార్టీలు, ఫలితాల తర్వాత తమ రూటును మార్చుకున్నాయి. గెలిచిన వారంతా తమ వారేనంటూ ప్రచారం ప్రారంభించారు. స్వతంత్రులనే కాదు ఇతర పార్టీల వారిని సైతం తమ ఖాతాలో వేసుకునే పనిలో నిమగ్నమయ్యాయి. ప్రధాన పార్టీలన్నీ ఆ సర్పంచ్ మావాడే.. ఈ సర్పంచ్ మావాడే అని చెప్పుకోవడం తప్ప నిజంగా సదరు సర్పంచ్ ఏ రాజకీయ పార్టీకి చెందినవాడో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. అయితే సర్పంచుల ఫోరం అధ్యక్ష పదవి ఎంపికపై తెరవెనుక జరుగుతున్న రాజకీయాలు మండలంలో మంటలు పుట్టిస్తున్నాయి. – వరంగల్ వాయిస్, హనుమకొండ

వివరాలు2లో..



## రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన విజయవంతం చేద్దాం

2లో..

- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- వరంగల్ చౌరస్తా నుంచి బైక్ ర్యాలీ

## విద్యార్థుల చేతుల్లోనే.. ఫ్యూచర్ ఇండియా

8లో..



- రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి స్ఫూర్తిగా ముందుకు సాగాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య




2లో..

## డీసీసీ అధ్యక్షుడిగా ఇనుగాల బాధ్యతల స్వీకరణ

- పాల్గొన్న మంత్రులు పొంగులేటి, సీతక్క

# ‘సర్పంచ్’ కబ్జా..!

- కమలాపూర్‌లో విచిత్ర రాజకీయం
- గెలిచిన సర్పంచులపై పార్టీల కర్చీఫ్
- అన్నీ ఎమ్మెల్యే ఖాతాలోనే..
- బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులూ నా వాళ్లే అంటున్న కౌశిక్ రెడ్డి
- ఫోరం అధ్యక్ష పదవిపై ముదురుతున్న కుమ్ములాట



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కమలాపూర్ మండలంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో మిశ్రమ ఫలితం లభించింది. బీఆర్ఎస్ ఏడు, కాంగ్రెస్ ఐదు, బీజేపీ (ఈటల వర్గం) ఐదు, బీజేపీ (బండి సంజయ్ వర్గం) రెండు, స్వతంత్రులు ఐదుగురు గెలుపొందారు. అయితే, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాత్రం అన్నీ తన ఖాతాలోనే వేసుకుంటున్నారు. తమ పార్టీ నుంచి గెలిచిన ఏడుగురు సర్పంచులే కాకుండా, మరో ఐదుగురు సర్పంచులు కూడా తమ మద్దతుదారులేనంటూ ఆయన ప్రకటించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. చివరకు బండి సంజయ్ వర్గానికి చెందిన అభ్యర్థి గెలుపును కూడా తన ఖాతాలో వేసుకోవడం ఎమ్మెల్యే వ్యూహాలకు పరాకాష్టగా నిలిచింది.

### ఫోరం అధ్యక్ష పదవిపై రగడ..

సర్పంచుల ఫోరం అధ్యక్ష పదవి ఎంపికపై తెరవెనుక జరుగుతున్న రాజకీయాలు మండలంలో మంటలు పుట్టిస్తున్నాయి. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పీఏగా పని చేస్తున్న శివరాం తండ్రి (స్వతంత్రంగా గెలిచిన సర్పంచ్)కి ఈ పదవి కట్టబెడతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. గతంలోనూ దేశరాజుపల్లి, శంభునిపల్లి గ్రామాలకు చెందిన వారే ఫోరం అధ్యక్షులుగా ఉన్నారని, ప్రతిసారీ ఆ గ్రామాలకే పదవులా అని ఇతర గ్రామ సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో కాకుండా కేవలం రాజకీయ డీల్‌ల ద్వారా అధ్యక్షుడిని ఎంపిక చేస్తే తిరుగుబాటు తప్పదని సర్పంచులు హెచ్చరిస్తున్నారు. ఎన్నికల్లో ప్రజలు ఓటు ఎవరికి వేశారు? గెలిచిన అభ్యర్థులు ఎవరి పక్షాన ఉన్నారు? అన్నది పక్కన పెడితే, ప్రస్తుతం శక్తివంతులైన నేతలు ఎవరిని తమ వారుగా ప్రకటిస్తే వారే గెలిచినట్లుగా పరిస్థితి మారింది. ఇది నిజమైన ప్రజాస్వామ్యమా లేక రాజకీయ కబ్జానా అని స్థానిక ఓటర్లు ప్రశ్నిస్తున్నారు.

# రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన విజయవంతం చేద్దాం

- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- వరంగల్ చౌరస్తా నుంచి బైక్ ర్యాలీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్ రావు ఈ నెల 8 వరంగల్ జిల్లాలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీని బలోపేతం చేయడంతోపాటు ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఉధృతం చేసే లక్ష్యంతో రాష్ట్ర అధ్యక్షులు జిల్లా పర్యటన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పర్యటన జిల్లా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ పటిష్టతతోపాటు భవిష్యత్ కార్యాచరణపై రాష్ట్ర అధ్యక్షులు స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమాలోచన చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై దిశానిర్దేశం చేస్తారన్నారు. రామచందర్ రావు పర్యటన నేపథ్యంలో పార్టీ శ్రేణులతో కలిసి వరంగల్ చౌరస్తా నుంచి సభా ప్రాంగణం రాజశ్రీ గార్డెన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. వరంగల్ జిల్లాలోని బీజేపీ నాయకులు, శక్తి కేంద్రాల ఇంచార్జీలు, బూత్ స్థాయి కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి రాష్ట్ర అధ్యక్షుల పర్యటనను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడి రాక జిల్లా బీజేపీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలవాలని, మన ఐక్యతను చాటి చెప్పాలని గంట రవికుమార్ పిలుపునిచ్చారు.



# డీసీసీ అధ్యక్షుడిగా ఇనుగాల బాధ్యతల స్వీకరణ

- పాల్గొన్న మంత్రులు పొంగులేటి, సీతక్క

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఇనుగాల వెంకటరామిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. గత 15 సంవత్సరాలుగా హనుమకొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేసిన మాజీ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి పలువురు అభినందించారు. హనుమకొండ డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఇనుగాల వెంకటరామిరెడ్డిని శాలువాతో సన్మానించారు. పూల బోకేతో అభినందించారు. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సమర్థవంతంగా పనిచేస్తానని ఇనుగాల వెంకటరామిరెడ్డి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడే పార్టీ అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ రియాజ్, మేయర్ సుధారాణి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పార్టీ ఇంచార్జిలు, నియోజకవర్గ ఇంచార్జిలు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, డివిజన్, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేటీఆర్‌ను అడ్డుకుంటాం

- రాహుల్, రేవంత్ లకు క్షమాపణ చెప్పాల్సిందే
- టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ హెచ్చరిక



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమర్యాదగా మాట్లాడటాన్ని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. రాహుల్, రేవంత్ రెడ్డికి కేటీఆర్ క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకుంటాయని బండి సుధాకర్ గౌడ్ హెచ్చరించారు. పార్టీకి నష్టం జరిగినా పట్టుబట్టి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చిందని, లేకుంటే ఇవాళ నీ పరిస్థితి, నీ కుటుంబం పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. హైదరాబాద్ లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2014లో కొత్త రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్ తో మీకు అప్పజెప్పితే.. పదేండ్లు కుటుంబంలో అందరూ రాబందుల్లా పీక్కుతిని, లక్షల కోట్లు దోచుకొని, నేడు తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పాలనలో కాంట్రాక్టర్లకు బకాయి పడిన రూ.60 వేల కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తున్నదన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజా నినాదమైన నిధులు, నీళ్లు, నియామకాలను మీరు ఎగ్గొడితే.. ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని, వాటితో పాటుగా ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నదని బండి సుధాకర్ గౌడ్ అన్నారు.

# సాయుధ పోలీసుల పనితీరు అభినందనీయం

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ వాయిస్, పోలీస్ కమిషనరేట్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణతో పాటు శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ పోలీసుల పని తీరు అభినందనీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగాన్ని తనిఖీ చేశారు. ఈ ఉదయం పోలీస్ పరేడ్ మైదానంకు చేరుకున్న వరంగల్ పోలీస్ కమిషనర్‌కు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ అధికారులు పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాయుధ పోలీసులు నిర్వహించిన పోలీస్ పరేడ్‌ను పోలీస్ కమిషనర్ తిలకించారు. పోలీసు కమిషనర్ డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజబుల్, మోటార్, ఆయుధగారం విభాగాల పనితీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించి సిబ్బంది పనితీరును సిపి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### ఆకట్టుకున్న స్పెషల్ పోలీస్ ఫోర్స్ విన్యాసాలు..

వరంగల్ పోలీస్ విభాగం ఏర్పాటయిన అనంతరం వరంగల్ కమిషనరేట్ విభాగంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో మొట్టమొదటి సారిగా రుద్రమ ఉమెన్ స్పెషల్ పోలీస్ ఫోర్స్ విభాగం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ విభాగంలో పనిచేసే మహిళలు పురుషులతో సమానంగా ప్రత్యేకంగా కంమాండో తరహాలో శిక్షణ పూర్తి చేయడంతో పాటు, అన్ని దేహదారుఢ్య శిక్షణ, ఆయుధ శిక్షణలో ఈ రుద్రమ ఉమెన్స్ పోలీస్ స్పెషల్ ఫోర్స్ విభాగం మహిళా పోలీసుల పనితీరును పోలీస్ కమిషనర్ పరిశీలించారు. ఈ తనిఖీల్లో అదనపు డిసిపిలు సురేష్‌కుమార్, శ్రీనివాస్, రవి, ట్రైనీ ఐపిఎస్ మనిషా నేహ్రా, ఏసిపిలు నాగయ్య, సురేంద్ర, ఆర్.ఐ స్పర్జన్ రాజ్, సతీష్, శ్రీధర్, చంద్రశేకర్‌తో పాటు ఆర్.ఎస్.ఐలు ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.





WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, జనవరి 07, 2026

# ముగ్గులు భారతీయ సంస్కృతికి ప్రతీక

**• చర్లపల్లిలో ఘనంగా ముగ్గుల పోటీలు**



**వరంగల్ వాయిస్, నడికూడ :** భారతీయ సాంప్రదాయంలో ముగ్గులకు విశిష్ట స్థానం ఉందని, అది ఇంటికి అందంతో పాటు శుభాన్ని చేకూరుస్తుందని నడికూడ మండల పరిషత్ అధికారి భార్గవి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బుధవారం నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భార్గవి మాట్లాడుతూ.. ప్రాచీన కాలం నుంచి వస్తున్న ముగ్గుల సంస్కృతిని నేటి తరం కూడా కొనసాగించడం అభినందనీయమన్నారు. ఇంటి ముందు కల్లాపి చల్లి పిండితో వేసే ముగ్గులు మన సంప్రదాయానికి అద్దం పడతాయని, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక పద్ధతుల్లో ముగ్గులు వేస్తున్నప్పటికీ, వాటి వెనుక ఉన్న ఉద్దేశం ఒక్కటేనని పేర్కొన్నారు. ఇదే వేదికపై పాఠశాల విద్యార్థుల ఫోటోలతో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను మండల విద్యాశాఖ అధికారి కున్సోత్ హనుమంతరావు, ఎంపీఓ భార్గవి కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల ఫోటోలతో క్యాలెండర్ ముద్రించడం గొప్ప ఆలోచన అని, ఇది ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా చర్లపల్లి పాఠశాల పనిచేస్తుందనడానికి నిదర్శనమని పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని ప్రశంసించారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లకావత్ దేవ, పుల్లూరి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కందికట్ల రమ, అంగన్వాడీ టీచర్లు భీముడి లక్ష్మి, నందిపాటి సంధ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన నర్సరీ ప్రారంభం



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామపంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన నర్సరీని బుధవారం సర్పంచ్ రాజు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ హరితహారం లక్ష్యంలో భాగంగా మొక్కల పెంపకానికి ఈ నర్సరీ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. నర్సరీతో గ్రామంలో పచ్చదనం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓశారద, ఈసీ రాజేష్, టీఏ సురేందర్, పంచాయతీ కార్యదర్శి సందీప్ , ఉప సర్పంచ్ గోల్కొండ రమేష్, వార్డు సభ్యుడు గోల్కొండ శ్రీనాథ్, సీనియర్ మేట్ గోల్కొండ రాజు, గ్రామస్తులు దేవల్లపెల్లి ప్రభాకర్, పున్నం చిరంజీవి, కారోబార్ రాజు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# వృద్ధాప్యం శాపం కాకూడదు

## హనుమకొండ ఆర్డీఓ రమేష్ రాథోడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తల్లిదండ్రులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి బిడ్డపై ఉంటుందని, వారిని ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హనుమకొండ ఆర్డీఓ రమేష్ రాథోడ్, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి హెచ్చరించారు. బుధవారం హనుమకొండ ఆర్డీఓ కార్యాలయంలో ట్రిబ్యునల్ కోర్టు ఆధ్వర్యంలో నూతన సంవత్సరం, సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ, డాక్టర్ అనితా రెడ్డి కలిసి కేక్ కట్ చేసి సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వృద్ధాప్యం ఎవరికీ శాపంగా మారకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్ చట్టాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఈ చట్టంపై గ్రామ స్థాయి నుంచి నగర స్థాయి వరకు ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ట్రిబ్యునల్ బెంచ్ ద్వారా వృద్ధుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని, తమకు ఉన్న హక్కుల పట్ల వృద్ధులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సీనియర్ సిటిజన్స్ ఏ సమస్య ఉన్నా భయం లేకుండా ట్రిబ్యునల్ బెంచ్‌ను ఆశ్రయించవచ్చు. ట్రిబ్యునల్ కోర్టులో కేసులను వేగంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేస్తున్నాం. చట్టం కల్పించిన హక్కులను వినియోగించుకుని వృద్ధులు ఆత్మగౌరవంతో జీవించాలి. ఈ కార్యక్రమంలో రజినీకాంత్, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది మరియు ట్రిబ్యునల్ సభ్యులు పాల్గొన్నారు.

# గుడియమ్మ గుడికి మహర్దశ



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** మండల కేంద్రంలోని కొంగుబంగారం శ్రీ గుడియమ్మ ఆలయం పునర్నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎన్నో ఏళ్లుగా సరైన భవనం లేక, ఎండకు ఎండి వానకు తడుస్తూ శిథిలావస్థకు చేరిన ఆలయానికి శాశ్వత నిర్మాణం చేపట్టేందుకు బుధవారం అధికారికంగా భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. గతంలో సరైన వసతులు లేకపోవడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఆలయం ముందున్న కాలువ నీరు చేరడం, వేసవిలో ఎండ వేడికి తట్టుకోలేక పూజలు నిర్వహించడం కష్టతరంగా ఉండేది. భక్తుల కష్టాలను గుర్తించిన గ్రామ సర్పంచ్ మామిడిశెట్టి సుగుణ ప్రత్యేక చొరవ తీసుకుని, ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ నిర్మాణంలో భాగంగా ఆలయ గర్భాలయంతో పాటు భక్తుల కోసం గాలిగోపురం, ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయనున్నారు. పనులు త్వరగా పూర్తి చేసి, భక్తులకు అమ్మవారి దర్శనం మరింత సౌకర్యవంతంగా కల్పించేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. ఆలయ పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అమ్మవారి కృపతో గ్రామం సుభిక్షంగా ఉండాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు చేన్నోజు శ్రీను, ఎన్ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, ఉప సర్పంచ్ రాజు, వార్డు సభ్యులు నల్ల కోటి, సునీల్, శ్రావణ్, సీనియర్ నాయకులు రాజ్ రెడ్డి, జాకీర్, కురెల్లి సాంబయ్య, బుస గణేష్, తోట రాజు, భక్తులు పాల్గొన్నారు.

# శ్మశాన వాటికకు మహర్దశ

## మట్టి రోడ్డు పనులు ప్రారంభం



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని పులుకుర్తి గ్రామస్తుల చిరకాల వాంఛ అయిన స్మశాన వాటిక దారి సమస్యకు త్వరలోనే పరిష్కారం లభించనుంది. గ్రామ శ్మశాన వాటికలో మట్టి రోడ్డు మరమ్మత్తు పనులను బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు, సర్పంచ్ కుమారుడు పెంచాల రాజేందర్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో శ్మశాన వాటికకు వెళ్లే దారి బురదమయంగా మారి గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని గుర్తించి తక్షణమే మరమ్మత్తులు చేపట్టినట్లు తెలిపారు. నాణ్యతతో కూడిన రోడ్డును నిర్మించి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు తమ పాలకవర్గం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వెనిజులా అధ్యక్షుడి కిడ్నాప్ దుర్మార్గం

## అమెరికా చర్యను ఖండించిన బీకేఎంయూ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్వతంత్ర సార్వభౌమ దేశమైన వెనిజులాపై అమెరికా అక్రమంగా దాడి చేసి, ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మధురోతో పాటు ఆయన సతీమణిని అర్ధరాత్రి కిడ్నాప్ చేసి అరెస్టు చేయడాన్ని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలో జరిగిన ఒక సమావేశంలో ఆయన అమెరికా అనుసరిస్తున్న దుర్మార్గపు విధానాలపై తీవ్రంగా మండిపడ్డారు. ప్రపంచ చమురు నిల్వలలో సుమారు 20 శాతం వాటా కలిగిన వెనిజులా సంపదను కొల్లగొట్టేందుకే అమెరికా ఈ కుట్రకు పాల్పడిందని వెంకట్రాములు ఆరోపించారు. "బలం ఉన్నవాడిదే బర్రె" అన్న చందంగా అమెరికా అధ్యక్షుడు వ్యవహరిస్తున్నారని, తమ దేశ బడా కంపెనీలకు వెనిజులా చమురును దోచిపెట్టడమే దీని వెనుక ఉన్న అసలు లక్ష్యమని విమర్శించారు. 20 ఏళ్ల క్రితం నాటి అధ్యక్షుడు చావేజ్ చమురు కంపెనీలను జాతీయం చేసి ఆ సంపదను ప్రజలకు పంచారని, అదే బాటలో నడుస్తున్న మధురోపై అసంబద్ధ ఆరోపణలు మోపి వేధించడం దారుణమన్నారు. క్యూబా, మెక్సికో, ఇరాన్ వంటి దేశాలను కూడా అమెరికా బెదిరించడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితితో పాటు అనేక దేశాలు ఈ చర్యను ఖండిస్తున్నా, భారత ప్రధానమంత్రి మౌనంగా ఉండటం దేశ ప్రతిష్టను దిగజార్చుతోందని విమర్శించారు. ట్రంప్‌ను సంతోషపెట్టడం కోసం ప్రజాస్వామ్య విలువలను పక్కన పెట్టవద్దని, వెంటనే వెనిజులా అధ్యక్ష దంపతులను విడుదల చేయాలని భారత ప్రభుత్వం అమెరికాపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# పరకాలను 'అమరవీరుల జిల్లా'గా ప్రకటించాలి

**▪ బీజేపీ నేత భాస్కరాచారి**

**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల ఏర్పాటు శాస్త్రీయంగా జరగలేదని, వాటిని పునర్వ్యవస్థీకరిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చేసిన ప్రకటనను బీజేపీ సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారుడు మారేడుగొండ భాస్కరాచారి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో పరకాల ప్రాంతానికి జిల్లా ఏర్పాటు విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పరకాల ప్రాంతం ముందుండి పోరాడిందని భాస్కరాచారి గుర్తు చేశారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి అసువులు బాసిన అమరవీరుల గడ్డ పరకాలని, ఆ త్యాగాలకు గుర్తుగా పరకాలను 'అమరవీరుల జిల్లా'గా ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పరకాలను కీలుబొమ్మగా మార్చి, ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి ఆమడదూరంలో ఉంచారని విమర్శించారు. ఒకవేళ జిల్లాలు పెంచడం సాధ్యం కాదనుకుంటే, వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి ఒకే జిల్లాగా చేసి, దానికి ప్రజల కొంగుబంగారమైన 'శ్రీ భద్రకాళి వరంగల్ జిల్లా'గా నామకరణం చేయాలని కోరారు. ప్రస్తుతం పరకాలలో వ్యాపారాలు దెబ్బతిని, ప్రతిచోటా 'టూ లెట్' బోర్డులు కనిపిస్తున్నాయని, ఆర్థికంగా ఈ ప్రాంతం వెనుకబడిపోయిందని



ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పరకాల అభివృద్ధి తన కల అని చెబుతున్న నేపథ్యంలో, ఆయన ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. పరకాల రాజకీయ, ఆర్థిక, చారిత్రక ప్రాధాన్యతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించి, పరకాలను జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని భాస్కరాచారి విజ్ఞప్తి చేశారు. పరకాలలో ఎదిగి, ఈ ప్రాంతాన్ని మర్చిపోయిన వారు కూడా ఇప్పుడు స్వస్థలం అభివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# గ్రామ అభివృద్ధికి సహకరించండి

### అధికారులను కోరిన సర్పంచ్ వెంకటేష్



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** శ్రీమన్నారాయణపురం గ్రామ అభివృద్ధికి అధికారులు పూర్తి స్థాయిలో సహకరించాలని నూతన గ్రామ సర్పంచ్ తుడి వెంకటేష్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని పలువురు అధికారులను సర్పంచ్, ఉప సర్పంచ్ గజ్జల నర్సిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సైలను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి, మౌలిక వసతుల కల్పనకు అధికారుల తోడ్పాటు అత్యవసరమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అధికారులు స్పందిస్తూ.. గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు మాచర్ల శ్రీనివాస్ గౌడ్, తుడి అంజయ్య, శ్రీనివాస్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా కోమాండ్ల చంద్రారెడ్డి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** ఆత్మకూరు మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన సీనియర్ కార్యకర్త కోమాండ్ల చంద్రారెడ్డి నియమితులయ్యారు. చంద్రారెడ్డి గత కొంతకాలంగా పార్టీ అభివృద్ధి కోసం చేసిన కృషిని, ప్రచార కార్యక్రమాల్లో ఆయన చొరవను గుర్తిస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు బొచ్చు చందర్ ఈ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా కోమాండ్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బొచ్చు చందర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామ్ రెడ్డికి, దళిత రత్న నత్తి కొర్నేల్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ స్టేట్ కన్వీనర్ పెరుమాండ్ల రామకృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కమలాపురం రమేష్, సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ బరుపట్ల కిరిటి, పరికిరాల వాసు, జిల్లా నాయకులు రేవూరి జలంధర్ రెడ్డి, మాజీ పీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ కు చంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు చర్యలు

### ఆత్మకూరు సీఐ సంతోష్ వెల్లడి




**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర 'శ్రీ సమ్మక్క–సారలమ్మ మేడారం మహా జాతర–2026'ను పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం పోలీస్ శాఖ ముందస్తు ఏర్పాట్లు చేపట్టింది. జాతీయ రహదారి–163పై ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేకంగా హోల్డింగ్ పాయింట్లను గుర్తించినట్లు ఎస్‌హెచ్‌ఓ సీఐ సంతోష్ తెలిపారు. జాతర సమయంలో వాహనాల రద్దీని క్రమబద్ధీకరించడానికి ఈ క్రింది ప్రాంతాలను హోల్డింగ్ పాయింట్లుగా నిర్ణయించారు. బుధవారం ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించిన సీఐ, అక్కడ భక్తులకు అవగాహన కల్పించేలా "మేడారం జాతర–2026 హోల్డింగ్ పాయింట్" అనే సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వాహనదారులు, భక్తులు సహకరించి జాతరను విజయవంతం చేయాలని కోరారు.

# సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

- 18న ఖమ్మంలో భారీ బహిరంగ సభ
- రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- హనుమకొండలో గోడ పత్రికల ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహించనున్న జాతీయ శత వార్షికోత్సవ ముగింపు సభను చారిత్రాత్మక విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఉత్సవాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశం నుంచే కాకుండా దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు ఈ సభకు తరలిరానున్నారని తెలిపారు. 100 ఏళ్ల సీపీఐ పోరాట చరిత్రను నేటి తరానికి చాటిచెప్పడంతో పాటు, దేశంలో పెరుగుతున్న మతోన్మాదం, ఆర్థిక అసమానతలపై భవిష్యత్తు పోరాటాలకు ఈ సభ దిక్సూచిగా మారుతుందన్నారు. ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ. సభకు ముందు పెవిలియన్ మైదానం నుండి 15 వేల మంది జనసేవాదళ్ కార్యకర్తల కవాతు, కళాకారుల ప్రదర్శనలు. ఖమ్మం సప్తపది ఫంక్షన్ హాల్లో సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశాలు. 'భారతదేశంలో వామపక్ష ఉద్యమం – సవాళ్లు' అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్. 20న జరిగే సెమినార్‌కు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం నేత ఎం.ఎ.బేబి, దీపాంకర్ భట్టాచార్య వంటి జాతీయ స్థాయి వామపక్ష నేతలు హాజరవుతారని ఆయన వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా జీపు జాతాలు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రెండు కార్డుల విధానం రద్దు చేయండి

- 252 జీవోను సవరించాలి
- ఉమ్మడి వరంగల్ డెస్క్ జర్నలిస్టుల డిమాండ్
- డెస్క్ జర్నలిస్టుల జిల్లా అడహాక్ కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ల కోసం ఇటీవల జారీ చేసిన 252 జీవోను వెంటనే సవరించాలని, డెస్క్ జర్నలిస్టుల పట్ల వివక్ష చూపే రెండు కార్డుల విధానాన్ని ఉపసంహరించుకోవాలని డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్‌టీ) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణలో ఫెడరేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో వార్తలు సేకరించే విలేకరులు, వాటిని ప్రచురణకు సిద్ధం చేసే డెస్క్ జర్నలిస్టులు.. ఇరువురు చేసే పని ఒకటేనని, అలాంటప్పుడు వేర్వేరు కార్డులు జారీ చేయడం సమంజసం కాదని ప్రశ్నించారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమకు, ప్రభుత్వ తాజా నిర్ణయం వల్ల కనీస గుర్తింపు కూడా లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

### జిల్లా అడహాక్ కమిటీ ఎన్నిక..

ఈ సమావేశంలో డెస్క్ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం జిల్లా అడాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా సీహెచ్ సోమనర్సయ్య, బోనాల రమేశ్, వనం శ్రీకాంత్, పైళ్ల రఘుపతిలు ఎన్నకయ్యారు. వచ్చే వారం రోజుల్లో ఉమ్మడి జిల్లాలోని డెస్క్ జర్నలిస్టులందరినీ సమన్వయం చేసుకుంటూ పూర్తి స్థాయి జిల్లా కమిటీని ఎన్నుకోవాలని ఈ సందర్భంగా తీర్మానించారు. ఈ సమావేశంలో సీనియర్ డెస్క్ జర్నలిస్టులు నల్లపురి విద్యాసాగర్, శంకర్రావు శంకేసి, వర్ధిల్లి లింగయ్య, పింగిళి శ్రీనివాస్‌రెడ్డి, చీకటి రాజేందర్, కెంచ అశోక్, ఉయ్యాల యువరాజ్, లోకుల రఘుపతి, చేరాల రాజు తదితరులు పాల్గొన్నారు.

### అడహాక్ కమిటీ తొలి సమావేశం..

డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (DJFT) ఉమ్మడి వరంగల్ జిల్లా అడ్ హక్ కమిటీ తొలి సమావేశం బుధవారం హనుమకొండలో జరిగింది. మంగళవారం జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఎన్నికైన కమిటీ సభ్యులు ఈ భేటీలో పాల్గొని, జిల్లాలో జర్నలిస్టుల సమస్యలపై నిర్వహించబోయే కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అడ్ హక్ కమిటీ సభ్యులు డీజేఎఫ్‌టీ రాష్ట్ర అధ్యక్షులు ఉపేందర్, ప్రధాన కార్యదర్శి మస్తాన్‌లతో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపారు. 252 జీవో సవరణ, డెస్క్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల సమస్యపై రాష్ట్ర స్థాయి చర్చల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర నాయకత్వం స్పందిస్తూ.. త్వరలోనే రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో సమావేశం కానున్నామని, ఆ భేటీ అనంతరం భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. అడ హాక్ కమిటీ సభ్యులు సీహెచ్.సోమనర్సయ్య, ఎంహెచ్.ముజాహిద్, వనం శ్రీకాంత్, బోనాల రమేష్, పైల్ల రఘుపతి పాల్గొన్నారు.

# ప్రభుత్వం ప్రతి ఇంటికీ బాకీ పడింది

- బీఆర్ఎస్ నాయకురాలు గంటా కళావతి
- పరకాలలో 'బాకీ కార్డుల' పంపిణీ
- కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ నేతల ధ్వజం



**వరంగల్ వాయిస్, పరకాల :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, ప్రతి వర్గానికి ఈ ప్రభుత్వం బాకీ పడిందని బీఆర్ఎస్ నాయకురాలు గంటా కళావతి విమర్శించారు. బుధవారం పరకాల పట్టణంలోని 12వ వార్డులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'బాకీ కార్డుల' పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏ వర్గానికి ఎంత బాకీ ఉందో వివరిస్తూ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చెల్లించాల్సిన బాకీలను ఈ విధంగా ఏకరువు పెట్టారు. ప్రతి మహిళకు ఏడాదికి రూ.60 వేల బాకీ, వృద్ధులు, వితంతువులకు రూ. 50 వేల చొప్పున బాకీ, సుమారు రూ. 70 వేల మేర బాకీ, ప్రతి ఎకరాకు రూ.20 వేల పెట్టుబడి సాయం బాకీ, హామీ ఇచ్చిన విధంగా ప్రతి విద్యార్థినికి స్కూటీ బాకీ, రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని, అనేక మంది రైతులు ఇంకా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని వారు మండిపడ్డారు. ప్రైవేట్ స్కూళ్ల కంటే దీటుగా ఉన్న ప్రభుత్వ వ్యవస్థను కాంగ్రెస్ నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ కోటి, దంచానల గణేష్, కుంటామల్ల లక్ష్మణ్, 12వ వార్డు ఇన్‌చార్జి మరియు దామెర బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండు రామకృష్ణ, చింతం రాజేష్, కొమ్ము రాజు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ వద్దు.. తండాలే ముద్దు

◆ డోర్నకల్‌లో గిరిజనుల భారీ రాస్తారోకో



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తమ తండాలను మున్సిపాలిటీ నుండి తొలగించి, తిరిగి గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ డోర్నకల్ పట్టణంలో గిరిజనులు భారీ ఆందోళన చేపట్టారు. పట్టణంలోని సిగ్నల్ తండా, లచ్చా తండా, సోమ్లా తండాలకు చెందిన వందలాది మంది గిరిజనులు బుధవారం ముత్యాలమ్మ గుడి సెంటర్ ఆవరణలో రాస్తారోకో నిర్వహించి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో విలీనం కావడం వల్ల తమకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఏడాదికి 900 రూపాయలుగా ఉన్న ఇంటి పన్ను, ఇప్పుడు 4 వేల రూపాయలకు పెరిగిందని మండిపడ్డారు. పన్నులు భారీగా వసూలు చేస్తున్నా.. వీధి దీపాలు, మురుగు కాలువలు, సరైన నీటి సరఫరా వంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నిటికంటే ముఖ్యంగా మున్సిపాలిటీలో చేరడం వల్ల గిరిజనులు ప్రధానంగా ఆధారపడే 'ఉపాధి హామీ' పనులు కోల్పోయామని, దీనివల్ల ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన ఈ ఆందోళనలో గిరిజన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీఐ చంద్రమౌళి, ఎస్సై వంశీధర్ చర్చలు జరిపినప్పటికీ గిరిజనులు వెనక్కి తగ్గలేదు. జిల్లా కలెక్టర్ వచ్చి లిఖితపూర్వక హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని తేల్చి చెప్పారు. ఈ క్రమంలో సీపీఎం నాయకులు గిరిజనులకు మద్దతు ప్రకటించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు వచ్చి ఎమ్మెల్యే రామచంద్రనాయక్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పినా గిరిజనులు ససేమిరా అన్నారు.

# ఆటో కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలి

## ఏడాదికి రూ.12 వేల భృతిని చెల్లించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా ఆటో కార్మికులకు సంవత్సరానికి 12,000 రూపాయల జీవన భృతిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ తహసీల్దార్ కార్యాలయం ముందు తెలంగాణ ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. తాటికాయల రత్నం అధ్యక్షతన జరిగిన ఈ నిరసనలో ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి, జిల్లా అధ్యక్షులు సుంచు జగదీశ్వర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' ఉచిత బస్సు పథకం వల్ల ఆటో కార్మికులు తమ జీవనోపాధిని పూర్తిగా కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదాయం లేక కుటుంబాలను పోషించుకోలేక దుర్భర జీవితాలు గడుపుతున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ తరహాలో తెలంగాణలో కూడా ఆటో కార్మికులకు భృతి కల్పించడంతో పాటు, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏడాదికి రూ. 12,000 తక్షణమే విడుదల చేయాలి. మహాలక్ష్మి స్కీమ్ వల్ల నష్టపోతున్న డ్రైవర్లకు నెలకు రూ. 4,500 పెన్షన్ ఇవ్వాలి. ప్రమాద భీమాను రూ. 10 లక్షలకు పెంచాలి. ఇందిరమ్మ ఇండ్లు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి. ఆటోలు లేని కార్మికులకు ప్రభుత్వం ఉచితంగా ఆటోలను అందజేయాలి. కేంద్ర బిజెపి ప్రభుత్వం కూడా లేబర్ కోడ్ల పేరుతో కార్మిక హక్కులను కాలరాస్తోందని, రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని వారు విమర్శించారు. ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ సుమన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎండీ.మహబూబ్ పాషా, ఉపాధ్యక్షులు మాలోత్ సాగర్, ఎస్.డీ.బాబా, ఇర్ఫాన్, రహమతుల్లా, చిరంజీవి, భాస్కర్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పోరాట పటిమ, సామాజిక స్పృహ కలిగి ఉండాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా పోరాట పటిమను, సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని మాజీ ప్రభుత్వ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సంక్రాంతి పురస్కరించుకొని నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బుధవారం హన్మకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సంగాల సూర్య కిరణ్ వర్మ, గంద్రకోట రాకేష్ యాదవ్, పస్తం అనిల్, కోరపెల్లి రాజేష్, ప్రశాంత్, బొల్లపెల్లి వీరస్వామి, స్నేహిత్, సందీప్ యాదవ్, పబ్బోజు శ్రీకాంత్ చారి, తక్కళ్లపల్లి వినీల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు

◆ 'విద్యారంగం సంక్షోభంలో ఉంది'.. పుస్తకాల ఆవిష్కరణ
◆ విద్యార్థుల భారీ ప్రదర్శన
◆ బహిరంగ సభలతో హోరెత్తిన వరంగల్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ నగర వేదికగా మూడు రోజుల పాటు సాగిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం 23వ రాష్ట్ర మహాసభలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ మహాసభల ముగింపు సందర్భంగా విద్యారంగ సమస్యలపై రూపొందించిన పలు పుస్తకాలను నాయకులు ఆవిష్కరించారు.ఈ నెల 5న హనుమకొండ ఏకశిలా పార్కు నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు వేలాది మంది విద్యార్థులతో నిర్వహించిన భారీ ప్రదర్శన నగరవాసుల దృష్టిని ఆకర్షించింది. అనంతరం 6, 7 తేదీలలో అబ్బూస్ ఫంక్షన్ హాల్ వేదికగా ప్రతినిధుల సభలు జరిగాయి. జేఎన్ యూ, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు హాజరై ప్రస్తుత విద్యా విధానంలోని లోపాలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లపై లోతైన ప్రసంగాలు చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోడపంగి నాగరాజు గత మహాసభల నుంచి ఇప్పటి వరకు జరిగిన ఆందోళనలు, సంఘం సాధించిన విజయాలపై నివేదికను సమర్పించగా, సభ్యుల చర్చ అనంతరం ప్రతినిధులు దానికి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా.. పీడీఎస్ యూ రాష్ట్ర కార్యవర్గం ప్రచురించిన "మళ్లీ డి టెన్షన్ గుదిబండే", "సంక్షోభంలో విద్యారంగం" అనే రెండు పుస్తకాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ ఆవిష్కరించారు. విద్యార్థులు తమ హక్కుల పట్ల అవగాహన పెంచుకోవడానికి ఈ పుస్తకాలు దోహదపడతాయని నాయకులు పేర్కొన్నారు. మహాసభల సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు, ప్రదర్శించిన నాటికలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆహ్వాన సంఘం నాయకులు రాచర్ల బాలరాజు, గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, బండి కోటేశ్వరరావు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుర్రం అజయ్, మర్రి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కమలాపూర్‌లో మేడారం జాతర సందడి

## ఏర్పాట్లకు ఘనంగా శ్రీకారం




**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రంలో త్వరలో జరగనున్న ప్రసిద్ధ శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహణ పనులకు బుధవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలోని అమ్మవార్ల గద్దెల వద్ద జాతర కమిటీ చైర్మన్, సర్పంచ్, ప్రజాప్రతినిధులు పసుపు–కుంకుమలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతర ఉత్సవ కమిటీ నేతలు మాట్లాడుతూ.. జాతరకు వచ్చే వేలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని పార్కింగ్ స్థలాలు, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులతో సమన్వయం చేసుకుంటామని పేర్కొన్నారు. జాతరను విజయవంతం చేయడానికి గ్రామస్తులు, భక్తులు పూర్తి స్థాయిలో సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జాతర చైర్మన్ చేరాల రోహిత్, సర్పంచ్ పబ్బు సతీష్, ఏఎంసీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్, ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు బాలసాని రమేష్, మౌటం కుమారస్వామి, నరసింహారెడ్డి, బాలాజీ, రమేష్, పరశురాములు, అశోక్, భిక్షపతి, విజయ్, పోడేటి భిక్షపతి, చంద్ర సింగ్, మునేందర్, చిరంజీవి, మాజీ సర్పంచ్ సమ్మయ్య, కృష్ణమూర్తితో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం హాజరయ్యారు.

# గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించండి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్లు, బిల్ కలెక్టర్లు మరియు ఇతర సిబ్బంది ఎదుర్కొంటున్న సుదీర్ఘకాలపు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యునైటెడ్ అసోసియేషన్ నాయకులు బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని హైదరాబాద్ సెక్రటేరియట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో, గ్రామ పంచాయతీ ఉద్యోగుల వేతనాలు, సర్వీస్ క్రమబద్ధీకరణ, ఇతర పెండింగ్ సమస్యల గురించి మంత్రికి సుదీర్ఘంగా వివరించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరపున అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అంకం సదానందం, రాష్ట్ర కన్వీనర్ నాగనబోయిన శ్రీనివాస్, మరియు రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తమ సమస్యలను విన్నవించుకోవడానికి అవకాశం కల్పించిన మంత్రికి వారు ధన్యవాదాలు తెలిపారు.

# శబరిమలై యాత్రకు అయ్యప్ప స్వాములు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలో అతి పురాతనమైన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో మాల ధరించి 41 రోజుల పాటు కఠిన నియమాలు ఆచరిస్తూ అయ్యప్ప స్వామి దీక్ష తీసుకున్న స్వాములు బుధవారం దేవాలయ చైర్మన్ గురు స్వామి సామల భిక్షపతి ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకొని శబరిమల యాత్రలకు బయలుదేరారు. గొట్టిముక్కుల రమేష్ సామల నాగరాజు, వనం విశాల్, సామల రవీందర్, వనం దేవరాజు, వినుకొండ రాజ్ కుమార్, భాషని బాలకృష్ణ, లోక బోయిన కుమారస్వామి, నాగరాజు భక్తులు పాల్గొన్నారు.

# ఉర్సు ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్,వరంగల్ :** వరంగల్ నగర ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచే కరీమాబాద్‌లోని హజరత్ మాషూక్–ఎ–రబ్బాని 470వ వార్షిక ఉర్సు ఉత్సవాలకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 11, 12, 13 తేదీల్లో జరగనున్న ఈ వేడుకల గోడపత్రికను (పోస్టర్) దర్గా పీఠాధిపతి నవీద్ బాబా బుధవారం ఆవిష్కరించారు. జనవరి 11 సాయంత్రం 5 గంటలకు దర్గా పీఠాధిపతి నివాసంలో 'ఫాతిమా'తో ఉత్సవాలు అధికారికంగా ప్రారంభమవుతాయి. జనవరి 12న రాత్రి 9 గంటలకు అత్యంత కీలకమైన 'సందల్ సాని' ఉత్సవం, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. జనవరి 13న ఉదయం ఖురాన్ పఠనం అనంతరం హజ్రత్ సయ్యద్ షా హైదర్ ఇల్లాలుద్దీన్ ఖాద్రి జిలానీకి ప్రత్యేక ఫాతేహా నిర్వహిస్తారు. ఈ 470వ ఉర్సు ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచే కాకుండా వివిధ దేశాల నుంచి సుమారు 10 లక్షల మంది భక్తులు హాజరవుతారని నవీద్ బాబా తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీస్, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. తాగునీరు, పారిశుధ్యం, భారీ బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు.

# 10లోపు మేడారం విద్యుత్ పనులు పూర్తి కావాలి

◆ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ ప్రసిద్ధ మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు సంబంధించి అన్ని విద్యుత్ పనులను ఈనెల 10లోపు పూర్తి చేయాలని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ నుంచి మేడారం విద్యుత్ ఏర్పాట్లపై ఆయన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. జాతర కోసం ప్రత్యేకంగా నిర్మిస్తున్న 33/11 కేవీ నార్లాపూర్ సబ్ స్టేషన్‌ను జనవరి 16న, గట్టమ్మ ఆలయం వద్ద నిర్మిస్తున్న సబ్ స్టేషన్‌ను జనవరి 20న ఛార్జ్ (ప్రారంభం) చేయాలని సూచించారు. జాతరలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పార్కింగ్ స్థలాల్లో విద్యుత్ సరఫరా పనులను 10వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు వివిధ సామర్థ్యాలు గల 170 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని, మిగిలిన చోట్ల కూడా అవసరమైన పనులు త్వరగా ముగించాలని ఆదేశించారు. జాతరలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఎల్టీ లైన్లలో స్పేసర్లు అమర్చాలని, ఎక్కడా అంతరాయం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతర విధుల్లో దాదాపు 500 మంది విద్యుత్ సిబ్బందితో పాటు వివిధ ఏజెన్సీలు పాల్గొంటున్నాయని, వారందరికీ స్పష్టమైన డ్యూటీ చార్ట్ రూపొందించాలని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) వి.మోహన్ రావు, డైరెక్టర్ (ఆపరేషన్స్) టి.మధుసూదన్, చీఫ్ ఇంజనీర్ కె.రాజు చౌహన్, ములుగు ఎస్ఈ ఆనందం, డీఈలు పి.నాగేశ్వర రావు, రాజు, సదానందం, సివిల్ ఈఈ వెంకట్ రామ్, ఏడీఈలు రాజేష్, వేణుగోపాల్, సందీప్ పాటిల్ పాల్గొన్నారు.

# ఏకశిలా పార్కులో బ్యాండ్ కళాకారుల గర్జన



- ఐక్యమత్యంతోనే సమస్యల పరిష్కారం
- కన్వీనర్ వేల్పుల శ్రీనివాస్
- హాజరైన ఉమ్మడి నగరాల బ్యాండ్ మాస్టర్లు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్, హనుమకొండ, కాజీపేట త్రినగరాల ఎస్సీ, ఎస్టీ, బీసీ బ్యాండ్ మాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలోని ఏకశిలా పార్కులో భారీ సమావేశం నిర్వహించారు. జిల్లా కన్వీనర్ వేల్పుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో బ్యాండ్ కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా వేల్పుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన బ్యాండ్ మాస్టర్లు, కళాకారులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. బ్యాండ్ కళాకారుల శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం దక్కేలా సంఘం తరపున కృషి చేస్తామన్నారు. వృత్తిలో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు అందరూ కలిసికట్టుగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో బ్యాండ్ సంఘం సీనియర్ నాయకులు కుక్కమూడి శంకర్, సుపుత్ర అంజయ్య, కుక్కమూడి చంద్రమౌళి, బండారి రాజన్న, ఎడ్ల సురేందర్ పాల్గొన్నారు. వీరితో పాటు వేల్పుల సారంగపాణి, నల్ల శంకర్, వేల్పుల రాజు, రాజారపు కిషన్, మంద ప్రశాంత్, ఇమ్మడి అరవింద్, బండారి కిషన్, పెద్ద సంఖ్యలో బ్యాండ్ మాస్టర్లు హాజరయ్యారు.

# అర్చక ఉద్యోగుల పట్ల వివక్ష వీడాలి

## 'ఒకే శాఖ - ఒకే వేతనం' అమలు చేయాలి



**వరంగల్ వాయిస్, బోడుప్పల్ :** తెలంగాణ దేవాదాయ శాఖలో పనిచేస్తున్న అర్చక ఉద్యోగుల పట్ల ప్రభుత్వం, అధికారులు ప్రదర్శిస్తున్న వివక్షను తక్షణమే వీడాలని, అందరికీ సమానంగా 'ఒకే శాఖ – ఒకే వేతన' విధానాన్ని అమలు చేయాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అర్చక ఉద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. బుధవారం బోడుప్పల్‌లోని డీబీఆర్ ఫంక్షన్ హాల్‌లో గట్టు శ్రీనివాసాచార్యులు, రాజేశ్వర శర్మల అధ్యక్షతన జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు గంగు ఉపేంద్ర శర్మ, డీవీ.ఆర్ శర్మ, రవీంద్ర చారి మాట్లాడుతూ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ కార్యాలయ సిబ్బంది ట్రెజరీ ద్వారా వేతనాలు, పెన్షన్, హెల్త్ కార్డులు పొందుతూ రాజభోగాలు అనుభవిస్తుంటే, క్షేత్రస్థాయిలో దైవ సేవలో ఉన్న 40 శాతం మంది అర్చకులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్, అవుట్ సోర్సింగ్ పేరిట చాలీచాలని వేతనాలు ఇస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అర్చకులు నెలకు రూ.1500 కూడా పొందలేని దుస్థితిలో ఉన్నారని వారు గుర్తు చేశారు. అర్చక వెల్ఫేర్ బోర్డు వద్ద రూ.236 కోట్ల మూల నిధి ఉన్నప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ నిధులను అర్చకుల సంక్షేమానికి ఖర్చు చేయకుండా ప్రభుత్వ ఖజానాకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని 686 దేవాలయాల నుంచి కోట్లాది రూపాయల ఆదాయం వెళ్తున్నా, 6ఏ, 6బీ, 6సీ కేటగిరీ దేవాలయాల అర్చకులకు మాత్రం సరైన వేతనాలు లేకపోవడం దారుణమన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను వెంటనే కల్పించాలి. దశాబ్ద కాలంగా నిలిచిపోయిన క్యాడర్ స్ట్రెంత్ నవీకరణ చేపట్టి, కొత్త పోస్టులను భర్తీ చేయాలి. గత మూడేళ్ల స్పెషల్ ఇంక్రిమెంట్లు, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గారు చట్ట సవరణ తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ దేవాదాయ శాఖలోని ఉద్యోగులందరికీ సమాన వేతన విధానం అమలు చేయాలని ఈ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ కార్యక్రమంలో అర్చక వెల్ఫేర్ బోర్డు మెంబర్ శ్రావణ కుమార చార్యులు, ఉద్యోగ సంఘం అధ్యక్షులు కృష్ణమాచారి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి 600 మందికి పైగా అర్చకులు పాల్గొన్నారు.



# స్పెక్ట్రా గ్లోబల్ హై స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు



◆ బొమ్మల కొలువు, రంగవల్లుల పోటీలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని స్పెక్ట్రా గ్లోబల్ హై స్కూల్‌లో బుధవారం సంక్రాంతి వేడుకలు ముందస్తుగా అంబరాన్నంటాయి. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు తోట వాణి, శ్రీలత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. నేటి తరం విద్యార్థులు మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను మర్చిపోకూడదని పిలుపునిచ్చారు. చదువుతో పాటు క్రమశిక్షణ, ఐక్యత, పెద్దల పట్ల గౌరవం కలిగి ఉండాలని సూచించారు. పాఠశాలల్లో ఇలాంటి పండుగ వేడుకలు నిర్వహించడం ద్వారా పిల్లలకు మన ఆచార వ్యవహారాల పట్ల అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థినుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు నిర్వహించిన రంగవల్లుల (ముగ్గుల) పోటీలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాలంటైన్స్ డే రోజు కపుల్ ఫ్రెండ్లీ మూవీ రిలీజ్



టాలీవుడ్ యాక్టర్ సంతోష్ శోభన్ హీరో గా నటిస్తున్న చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్‌బ్యానర్‌పై తెరకెక్కుతోంది. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా మేకర్స్ రిలీజ్ అప్‌డేట్ అందిస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. ఈ మూవీని వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 14న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. సన్‌లైట్‌లో హీరోహీరోయిన్లు రొమాంటిక్ మూడ్‌లో ఉన్న లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రానికి అజయ్ కుమార్ రాజు పీ కో`ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే లాంచ్ చేసిన టీజర్ మిడిల్ క్లాస్ కష్టాల నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది. టీజర్‌లో నెల్లూరు కుర్రాడైన శివ (సంతోష్ శోభన్) ఇంటీరియర్ డిజైనింగ్ చేస్తూ, సరైన ఉద్యోగం లేక చెన్నైలో కష్టాలు పడుతుంటాడు. ఖర్చుల కోసం బైక్ పూలింగ్(రాపిడో లాంటివి) చేస్తుంటాడు. ఈ క్రమంలోనే ప్రీతి (మానస వారణాసి) అతని బైక్‌లో ప్రయాణిస్తుంది. అలా అనుకోకుండా కలిసిన ఈ ఇద్దరూ ఆ తర్వాత ఎలా ప్రేమలో పడతారు..? ఆ తర్వాత ఏం జరిగింది..? అనే నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు టీజర్ చెప్పకనే చెబుతోంది.

## మా ఇంటి బంగారంతో సమంత పలకరింపు


సమంత అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. దర్శకురాలు మినహా ఇప్పటివరకూ ఎవరూ ఈ సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్‌ను సామ్ షేర్ చేశారు. ఈ సంక్రాంతికి టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్న సమంత .. ఆసక్తికర క్యాప్షన్ పెట్టారు. 'మీరు చూస్తా ఉండండి.. మా ఇంటి బంగారం మీ అందరితో కలిసిపోతుంది అంటూ రాశారు. జనవరి 9న ఈ మూవీ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు వెల్లడిరచారు. దీంతో అభిమానులు సంబర పడుతున్నారు. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అని కామెంట్స్ చేస్తున్నారు. 'ఓ బేబీ' తర్వాత సమంత దర్శకురాలు నందిని రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. గతేడాది అక్టోబర్ 2న దీని షూటింగ్‌ను ప్రారంభించారు. తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై సమంత నిర్మిస్తున్న రెండో చిత్రమిది. దర్శకుడు రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరి సహ నిర్మాతలు. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్నట్లు సమాచారం. ఇందులో సమంతతో పాటు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలకపాత్రలో నటిస్తున్నారు. దీనితో పాటు సమంత ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' లో నటిస్తున్నారు. దర్శకద్వయం రాజ్, డీకే దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఆదిత్యరాయ్ కపూర్, అలీ ఫజల్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. పీరియాడిక్ డ్రామాగా ఇది రూపొందుతోంది.



## దృశ్యం -3 ఏప్రిల్‌లో విడుదల



మలయాళం నుంచి క్రైం థ్రిల్లర్ జోనర్‌లో వచ్చి దక్షిణాది భాషల్లో సూపర్ క్రేజ్ సంపాదించిన ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ దృశ్యం. జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలతో ప్రేక్షకులను కట్టిపడేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పుడీ ఫ్రాంచైజీలో అందరినీ మెస్మరైజ్ చేసేందుకు మరోసారి దృశ్యం 3 కూడా వస్తోంది. మోహన్ లాల్ , మీనా కాంబోలో వస్తోన్న దృశ్యం3 గత సెప్టెంబర్‌లో గ్రాండ్‌గా లాంచ్ అయింది. తాజా అప్‌డేట్ ప్రకారం ఈ మూవీ షూటింగ్ పూర్తయింది. ఇక ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రకటన రానే వచ్చింది. దృశ్యం ఎంతోమందిని ప్రభావితం చేస్తూ ఇప్పటికీ క్యూరియాసిటీతో ఎదురుచూసేలా చేస్తున్న సినిమా అని అన్నాడు డైరెక్టర్ జీతూ జోసెఫ్. ఎలాంటి భారీ అంచనాలు పెట్టుకోకుండా చూసే ఫ్రాంచైజీ ఇదని.. దృశ్యం 3ఏప్రిల్ తొలివారంలో మీ ముందుకు వస్తోందని ప్రకటించాడు. మొత్తానికి మూవీ లవర్స్ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న దృశ్యం థర్డ్ పార్టు రిలీజ్‌కు సంబంధించి డైరెక్టర్ జీతూ జోసెఫ్ క్రేజీ వార్తను షేర్ చేసి మూవీ లవర్స్‌తోపాటు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాడు. జార్జ్‌కుట్టీ ప్రపంచంలోకి మరోసారి తీసుకొస్తూ.. అంటూ మోహన్ లాల్ చాలా రోజుల క్రితం షేర్ చేసిన ఫొటో ఒకటి ఇప్పటికే నెట్టింట చక్కర్లు కొడుతోంది. దశ్యం ఫ్రాంచైజీలో వచ్చిన రెండు పార్టులు ఇప్పటికే బ్లాక్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. ఫస్ట్ పార్ట్ థియేటర్‌లో విడుదలవగా.. రెండో పార్టు ఓటీటీలో విడుదలైంది. రెండు పార్టులను తెరకెక్కించిన ఆశీర్వాద్ సినిమాస్ దశ్యం 3ని కూడా తెరకెక్కిస్తోంది. కాగా హిందీలో అజయ్ దేవ్‌గన్, శ్రియా కాంబోలో దృశ్యం 3 కూడా తెరకెక్కుతుండగా.. ఈ మూవీని 2026 అక్టోబర్ 2న రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్.




## ఆగని దురంధర్ దూకుడు


### ఇప్పటికే రు.1240 కోట్లు వసూళ్లు


ధురంధర్ సినిమా బాక్సాఫీసు వద్ద దూసుకెళ్తున్నది. ఆ ఫిల్మ్ కలెక్షన్ల జోరు తగ్గడం లేదు. తాజాగా ఆ ఫిల్మ్ ఓ కొత్త రికార్డు క్రియేట్ చేసింది. అత్యధిక వసూళ్లు చేసిన హిందీ భాష చిత్రంగా ధురంధర్ ఘనత సాధించింది. ఇప్పటి వరకు హిందీ భాషలో ధురంధర్ సినిమా రూ.1240 కోట్లు ఆర్జించినట్లు ఫిల్మ్ మేకర్స్ పేర్కొన్నారు. ఆదిత్య థార్ డైరక్షన్‌లో వచ్చిన ధురంధర్ సినిమా ప్రస్తుతం సంచలనాలు నమోదు చేస్తున్నది. జియో స్టూడియోస్ ప్రకారం ఆ ఫిల్మ్ కేవలం హిందీ భాషలోనే ఇప్పటి వరకు 1240 కోట్లు ఆర్జించింది. భారత్‌లో ఇప్పటి వరకు 968 కోట్లు ఆర్జించింది. ఇక విదేశాల్లో ఆ సినిమాకు 272 కోట్లు వచ్చాయి. దురంధర్ 2 చిత్రాన్ని మాత్రం హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో రిలీజ్ చేయనున్నారు. ఆ ఫిల్మ్ ఈ ఏడాది మార్చి 19న రిలీజ్ కానున్నది. అయితే తొలి పార్ట్‌కు విపరీతమైన డిమాండ్ ఉన్న కారణంగా.. ఆ ఫిల్మ్ సీక్వెల్‌ను పలు ఇతర భారతీయ భాషల్లో రిలీజ్ చేసే ఉద్దేశంతో నిర్మాతలు ఉన్నారు. రిలీజైన తర్వాత ధురంధర్ చిత్రం హిందీ భాషలో పలు రికార్డులు నెలకొల్పింది. కేవలం 16 రోజుల్లోనే ఇండియాలో 500 కోట్లు వసూల్ చేసింది.

## ఆ రెండు చిత్రాలకు హైకోర్టులో ఊరట

### టిక్కెట్ ధర పెంచుకునేలా ఉత్తర్వులు

'ది రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్ర నిర్మాతలకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల విషయంలో గతంలో సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు 'పుష్ప2', 'ఓజీ', 'గేమ్ ఛేంజర్', 'అఖండ 2' చిత్రాలకే పరిమితం చేసింది. దీంతో తాజా చిత్రాల నిర్మాతలకు ఊరట లభించినట్లయ్యింది. టికెట్ ధరలు పెంచడానికి వీల్లేదంటూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ 'రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్ర నిర్మాతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరుతూ వేర్వేరుగా పిటిషన్లు వేశారు. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల కోసం హోంశాఖ కార్యదర్శికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆ విజ్ఞప్తిని పరిశీలించేలా హోంశాఖ కార్యదర్శికి సూచించాలని కోరారు. దీనిపై బుధవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. గతంలో ఇచ్చిన తీర్పును ఆ చిత్రాల వరకే పరిమితం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఈ రెండు చిత్రాలకు టికెట్ ధరలు పెంచుకునే అవకాశం లభించింది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన 'ది రాజాసాబ్' జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుండగా.. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న విడుదల కానుంది. హైకోర్టు ఉత్తర్వులతో 'ది రాజాసాబ్' బుకింగ్స్ ఓపెన్ కానున్నాయి.



WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

బుధవారం, జనవరి 07, 2026



# విద్యార్థుల చేతుల్లోనే.. ఫ్యూచర్ ఇండియా

- రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి స్ఫూర్తిగా ముందుకు సాగాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, వడ్డేపల్లి :** హనుమకొండలోని పింగళి మహిళ డిగ్రీ కళాశాలలో భారత సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) నిర్వహించిన వందేమాతరం 150వ వార్షికోత్సవ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా సీబీసీ ఏర్పాటు చేసిన వందేమాతరం భారత రాజ్యాంగ చరిత్ర తెలియజేసే ఫోటో ఎగ్జిబిషన్ ను ఎంపీ ప్రారంభించి సందర్శించారు. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ చదువుకునే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. ఈ గొప్ప అవకాశాన్ని దేశానికి అందించిన మహానుభావుడు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ అని కొనియాడారు. చదువే పేదరిక నిర్మూలనకు ప్రధాన ఆయుధమన్నారు. సమాన హక్కులు అందించే శక్తి ఒక్క చదువుకే ఉందని స్పష్టం చేశారు. యువత దేశ చరిత్రను తెలుసుకొని, దేశ అభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. భారతదేశం సర్వమత సమ్మేళనమని, మన దేశం సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయమని పేర్కొన్నారు. సరోజిని నాయుడు, దుర్గాబాయి దేశ్‌ముఖ్ వంటి మహిళా నాయకుల సేవలను స్మరించుకుంటూ, ప్రతి విద్యార్థిని రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయిలను స్ఫూర్తిగా తీసుకొని ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. మహిళలు విద్యతో పాటు సామాజిక, రాజకీయ రంగాల్లో మరింత ముందుకు రావాలని అన్నారు. ప్రస్తుత విద్యార్థులే భవిష్యత్ ఇండియా అని పేర్కొన్న ఎంపీ, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. అలాగే సోషల్ మీడియా పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని, తమ భవిష్యత్ తమ చేతుల్లోనే ఉందని, చదువుపైనే పూర్తి నియంత్రణ ఉండాలని కావ్య పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవ వంటి అన్ని రంగాల్లో చురుకుగా పాల్గొనాలని, అప్పుడే దేశభక్తి, ఐక్యత, సమానత్వ విలువలతో కూడిన సమగ్ర ప్రతిభ వికసిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ కోటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, అధ్యాపకులు, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అధికారులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## రూపు రేఖలు మారాలి

- ఇంచార్జి మంత్రి పొంగులేటి
- అధికారులతో కలిసి అభివృద్ధిపై సమీక్ష



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధిపై ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) సమీక్ష నిర్వహించారు. హనుమకొండలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం (ఐడీఓసీ) లోని సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల గృహాలు, భూ భారతి, యూరియా, ధాన్యం సేకరణ, ఎయిర్ పోర్ట్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇన్నర్ రింగ్ రోడ్డు, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్, భద్రకాళి మాడవీధులు, సూపర్ స్పెషాలిటి హాస్పిటల్, వరద నివారణ పనులు తదితర అంశాలపై సమీక్షించారు. అదే విధంగా నగర రూపురేఖలు మార్చేందుకు స్మార్ట్ సిటీ, ఫార్మా సిటీ, ఐటీ, తయారీ యూనిట్లు, పర్యాటకం, డ్రైనేజీ, రోడ్ల విస్తరణ వంటి రంగాలపై దృష్టి సారించారు. ముఖ్యంగా హైదరాబాద్‌తో సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేయడానికి 2050 వరకు మాస్టర్ ప్లాన్ అవసరమని అధికారులు పేర్కొన్నారు. విమానాశ్రయ భూసేకరణ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కలెక్టరేట్ వంటి పనులు వేగవంతం అవుతున్నాయని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, భద్రకాళి మాడవీధుల నిర్మాణం, వరద నివారణ వంటి అంశాలపై కూడా సమీక్షించి పలు సలహాలు సూచనలు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, లోక్ సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, మురళీ నాయక్, గండ్ర సత్యనారాయణ, పల్లా రాజేశ్వర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామి రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ పీడీ వీపీ.గౌతం, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని కలెక్టర్లు స్నేహ శబరిష్, డాక్టర్ సత్య శారద, రాహుల్, షేక్ రిజ్వాన్ బాషా, అద్వైత్ కుమార్, బల్దియా కమిషనర్ చాహాత్ బాజ్ పాయి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## జాతరకు సదుపాయాలు కల్పించండి

□ కమిషనర్ ను కోరిన అమ్మవారిపేట ఆలయ కమిటీ


**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఈనెల 28, 29, 30, 31 తేదీల్లో 44 వ డివిజన్ పరిధిలోని అమ్మవారిపేటలో నిర్వహించనున్న శ్రీ సమ్మక్క– సారలమ్మ జాతరకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ గ్రేటర్ మున్సిపాలిటీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కి అమ్మవారిపేట ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ను కలిసి వినతిపత్రం అంజేశారు. జాతరకు విచ్చేయనున్న భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతి, మరుగుదొడ్ల సదుపాయం, రహదారి సౌకర్యం, వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. మూడు రోజుల పాటు భక్తులు అక్కడే మకాం వేసి ఉంటున్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జలగం అనిత రంజిత్ రావు, జాతర కమిటీ అధ్యక్షులు కోడూరి భిక్షపతి, ఆర్గనైజర్ దాసి రాందేవ్, డైరీ నాగరాజు, హరి తదితరులు పాల్గొన్నారు



## స్థానికులకే ఉద్యోగాలివ్వాలి

**‘ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్’ ఆధ్వర్యంలో నిరసన**

**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూనిర్వాసితులకు, స్థానికులకు 70 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ‘ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్’ కాజీపేట బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగారావు మాట్లాడుతూ కోచ్ ఫ్యాక్టరీలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు, కాజీపేట పరిసర ప్రాంతాల వారికి, ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగ యువతకు పెద్ద పీట వేయాలని డిమాండ్ చేశారు. అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసిన అభ్యర్థులకు నేరుగా పోస్టింగ్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్ఆర్ వీ.రావు, సెక్రెటరీ జి.ప్రేమ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సూర్యనారాయణ, ట్రెజరర్ వి.బిక్షపతి, ఆర్గనైజర్ సెక్రెటరీ ఎండి.రహమత్ ఆలీతో పాటు కమిటీ సభ్యులు, ఇతర పెన్షనర్లు పాల్గొన్నారు.



## మాడవీధులపై మంత్రి ఆరా..

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఓరుగల్లులో ప్రసిద్ధిగాంచిన భద్రకాళి దేవాలయం ప్రాంగణంలో జరుగుతున్న మాడవీధుల అభివృద్ధి పనులను బుధవారం సాయంత్రం ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. మాడవీధుల అభివృద్ధి పనుల్లో జరిగే ప్రతి పైసా ఖర్చు లెక్క చెప్పాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, మేయర్, జిల్లా కలెక్టర్లు, అధికారులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com